క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: మదీనాగూడ, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

◆ మార్కెట్ ఫీడర్ పరిధిలో ..ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోటవైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

◆ ఆల్విన్ కాలనీ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాసెల్లా వుడ్స్ విల్లాస్, శ్రీరాంనగర్ సీ బ్లాక్, అపర్ణ హైట్స్, శ్రీరాంనగర్ మెయిన్ రోడ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీసీఎల్ లేఅవుట్, మసీద్‌బండ మెయిన్ రోడ్, ఎస్ మార్ట్, మై హోం మంగళ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

◆ జయభేరి ఫీడర్ పరిధిలో.. ఏపీహెచ్‌బీ కాలనీ, రాడిసన్ హోటల్, డాగ్ పార్క్ పరిసరాలు, లీ మెరీడియన్ హోటల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జేవీ కాలనీ, కేంద్రీయ విహార్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చందానగర్ హుడాకాలనీ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

◆ శాంతినగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాంతినగర్, కడిమి ఆస్పత్రి, హుడాకేఫ్, వెంకటాద్రినగర్, జీహెచ్‌ఎంసీ కార్యాలయం, మీసేవా కేంద్రం, విద్యా నర్సింగ్ హోమ్ వంటి ప్రాంతాలలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: రాంనరేష్‌నగర్ ఫీడర్ పరిధిలో.. మంగళవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓల్డేజ్ హోమ్, చిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, ఏఎస్‌రాజునగర్, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర అదే విధంగా గౌతమీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస కాలనీ, లెక్ వ్యూ కాలనీ, గౌతమీనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్

మియాపూర్: బీఆర్‌ఎస్ పార్టీకి గత తొమ్మిదేళ్లుగా సేవలందిస్తున్నానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ అధిష్టానాన్ని కోరారు. మియాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ పార్టీలో చేరిన నాటి నుండి సీఎం కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన ప్రతి బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ ప్రతి ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలకపాత్ర పోషించానన్నారు. త్వరలో సీఎం కేసీఆర్, కేటీఆర్‌లను కలిసి తన అభ్యర్థనని వారికి తెలియజేస్తానన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేయడమే తన లక్ష్యమని అవకాశం ఇస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని అన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ అవసరాన్ని గుర్తించాలి

ఎస్వీ యూనివర్సిటీ ప్రొ.మురళీధర్

రాయదుర్గం: వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ బీవీ మురళీధర్ అన్నారు. మనూలో యూజీసీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో రాజనీతిశాస్త్రంలో రీఫ్రెషర్ కోర్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ పొందిన అంశాలను విద్యార్థులకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ మాట్లాడుతూ రిఫ్రెషర్ కోర్సులు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు.

ఘనంగా నాగపంచమి

గచ్చిబౌలి/రాయదుర్గం: నాగపంచమిని పురస్కరించుకుని శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన నాగదేవత విగ్రహాలు, పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ, నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్ అండర్ బ్రిడ్జి వద్ద నెలకొల్పిన నాగదేవత ఆలయానికి భక్తులు పోటెత్తారు.

శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి | ఆరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీ

పేరు: ఆరెకపూడి గాంధీ
తల్లిదండ్రులు: చిత్తరంజన్ దాస్, అనసూయమ్మ
వయస్సు: 61 సంవత్సరాలు
స్వస్థలం: పులకొండ, నందివాడ(మం), గుడివాడ, కృష్ణాజిల్లా
విద్యాభ్యాసం: ఐటీఐ
సంతానం: కొడుకు పృథ్వీ గాంధీ, కూతురు ప్రణతి గాంధీ
వృత్తి: రాధికా ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండి
నివాసం: ప్లాట్ నెం.19, 20, సప్తగిరి కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి
రాజకీయ ప్రస్థానం: 2014లో టీడీపీ అభ్యర్థిగా 80 వేల మెజారిటీతో గెలుపు,
◆ 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 40 వేల మెజారిటీతో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం

ఐదేళ్లలో అభివృద్ధి ఇలా..

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ గెలుపునకు నాంది కానుంది. హైదరాబాద్‌కు ఐకాన్‌గా నిలిచిన కేబుల్ బ్రిడ్జి, టీ హబ్, బయోడైవర్సిటీ జంక్షన్‌లో రెండు ఫ్లై ఓవర్లు, బొటానికల్ గార్డెన్, శిల్పపార్క్ ఫ్లైఓవర్లు, మల్కంచెరువు–షేక్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. 14 లింకు రోడ్ల నిర్మాణం..చెరువుల సుందరీకరణ, మంచి నీటి పైపులైన్లు, యూజీడీ పనులు, అంతర్గత రోడ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

–గచ్చిబౌలి

బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం: ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లిలో మరోసారి భారీ మెజార్టీతో గెలుస్తాం

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ మొదటివిడత టికెట్ల కేటాయింపు చేసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ బీఆర్‌ఎస్‌పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థిగా తనను ప్రకటించడం పట్ల సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో విజయం సాధించి గులాబీజెండాను ఎగురవేస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో పనిచేస్తామన్నారు. అందరి సహకారంతో ముందుకుసాగుతామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో గత తొమ్మిదేళ్ళలో 9వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా శేరిలింగంపల్లిలో అభివృద్ధి సాగిందన్నారు.

ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి


కాంటినెంటల్ ఆస్పత్రిలో భుజ సంబంధ వ్యాధుల వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ల బృందం

కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, ఛైర్మన్ డా.గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో సోమవారం భుజ వైకల్యాలు, చికిత్సల పురోగతిపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ జీవనశైలి, ఒకే రకమైన భంగిమలో ఎక్కువ గంటలు కూర్చోవడం, మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివన్నీ మనల్ని భుజం సంబంధిత వ్యాధులకు గురి చేస్తాయన్నారు. జిమ్ వర్కవుట్లు, గోల్ఫ్, టెన్నిస్, బ్యాడ్మింటన్ తరహా క్రీడా కార్యకలాపాలు సరైన మార్గనిర్దేశం చేయకపోతే తీవ్రమైన, దీర్ఘకాలిక భుజాల గాయాలకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆర్థోపెడిక్ టీమ్ డాక్టర్లు కె గౌతమ్ చౌదరి, జికె సుధాకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, వరుణ్, శ్రీనివాస్‌రెడ్డి భుజ వైకల్యాలు, రోగ నిర్ధారణ, చికిత్స, నివారణపై అవగాహన కల్పించారు. కాంటినెంటల్ ఆస్పత్రి ఇన్ఫెక్షియస్ డిసీజెస్ చీఫ్, మెడికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయ్ ఎల్లండి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌నకు వివిధ ఆస్పత్రుల నుంచి పలువురు వైద్యులు, నర్సులు, పారామెడిక్స్, విద్యార్థులు హాజరయ్యారు.

అంగరంగ వైభవంగా 'కావడి యాత్ర'

లోధ సమాజ్ ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ నుంచి మంచిరేవుల వరకు నిర్వహణ


ఊరేగింపు

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని లోధసమాజ్ ఆధ్వర్యంలో 'కావడి యాత్ర' అంగరంగ వైభవంగా సాగింది. నానక్‌రాంగూడలోని లోధ కులస్తులలో ఒక్కో కుటుంబం నుంచి ఒకరు కావడి ఎత్తుకొని యాత్రలో పాల్గొనడం విశేషం. శివనామస్మరణ, భజనలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. నానక్‌రాంగూడలోని వీరాంజనేయస్వామి ఆలయం నుంచి ఔటర్ రింగురోడ్డు అండర్ బ్రిడ్జి మీదుగా నార్సింగి, మంచిరేవుల గుట్టపై వెలసిన శివాలయం వరకు ఊరేగింపు సాగింది. శివుడికి జలాభిషేకం చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. కాగా ఈ కావడి యాత్రలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ–ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ ఎంఓయూ


ఇరు సంస్థల ప్రతినిధులతో వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌తో సోమవారం ఓ ఒప్పందాన్ని మూడేళ్ళ కాలపరిమితితో కుదుర్చుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నోడల్ కేంద్రంగా ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌తో మూడు సంవత్సరాల కాలానికి ముఖ్యంగా ఎమర్జెన్సీ హెల్త్ కేర్ సర్వీసెస్ డొమైన్‌లో కెపాసిటీ బిల్డింగ్, ట్రైనింగ్, సహకార పరిశోధన, స్టూడెంట్, ఫ్యాకల్టీ మార్పిడి వంటి అంశాలపై కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ బృందాలను హెచ్‌సీ యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అభినందించారు. ఈఎంఎల్‌సీ డైరెక్టర్ డాక్టర జీవి రమణారావు, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముత్తంగి గ్రామంలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో మూడు కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఓటరు జాబితా ప్రదర్శన


పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న డీసీ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ పరిధిలో సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితాను డీసీ వంశీకృష్ణ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని 243 పోలింగ్ కేంద్రాలలో ముసాయిదా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. ఓటర్లు జాబితాలో తమ పేర్లను విధిగా పరిశీలించుకోవాలని, వీటిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సెప్టెంబర్ 19వ తేదీలోగా తెలియజేయాలన్నారు. ఈ నెల 26, 27 సెప్టెంబర్ 3, 4 తేదిలలో సర్కిల్ పరిధిలోని అన్ని బీఎల్ఓ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. నూతన ఓటర్ నమోదుతో పాటు జాబితాపై అభ్యంతరాలను తెలపాలన్నారు.

హైటెక్స్‌లో ముగిసిన ప్రదర్శనలు


అవార్డు అందుకున్న 'సహజానంద్' ప్రతినిధులు

మాదాపూర్: మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న జంట ప్రదర్శనలు హిమ్‌టెక్స్ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషీన్‌టూల్, ఇంజనీరింగ్ ఎక్స్‌పో), ఐపిఈసీ(ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో, కాన్ఫరెన్స్) ప్రదర్శనలు సోమవారం ముగిశాయి. హైటెక్స్ జ్యూరీ కొన్ని స్టాల్స్‌కు నైపుణ్యం అధారంగా అవార్డులను అందజేశారు. సహజానంద్ లేజర్ టెక్నాలజీ ఉత్తమ వినూత్న ఉత్పత్తి అవార్డును అందుకుంది. సురేష్ ఇందు లేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బెస్ట్ మెటల్ ఫార్మింగ్ టెక్నాలజీ అవార్డు, బీజేడబ్ల్యూ బెస్ట్ మెటల్ ఫార్మింగ్ టెక్నాలజీ అవార్డును అందుకున్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 16 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, ఇద్దరికి రూ.3 వేలు, మరో వ్యక్తికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

24న సంగీత కచేరీ

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఈనెల 24వ తేదీన కాన్సర్ట్ ఇన్ ది డార్క్ పేరిట సంగీత కచేరీని నిర్వహిస్తున్నారు. పాఠశాల కెరీర్ కౌన్సెలర్లకు శిక్షణ నిమిత్తం ఈ కచేరీలో సంగీత మేధావి, పియానో విద్వాంసుడు కలైమామణి డాక్టర్ అనిల్ శ్రీనివాసన్, ప్రఖ్యాత బాసిస్ట్ నవీన్ నెపియర్ పెర్కసన్, వాద్యకారుడు కృష్ణకిషోర్, అవార్డు విన్నర్, గాయకుడు సాయివిఘ్నేష్‌లు కళ్ళకు గంతలు కట్టుకుని ప్రదర్శనను ఇవ్వనున్నట్టు తెలిపారు.

ప్రజా శ్రేయస్సు కోరే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి


ఆర్టీసీ కాలనీలో ప్రజాయాత్రలో రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: అవినీతి పాలనను అంతమొందించి, ప్రజా శ్రేయస్సు కోరే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్‌లలో బీజేపీ గడపగడపకు రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్ అవినీతి పాలనను అంతమొందించడానికి ప్రతి ఒక్కరు బీజేపీతో కలిసి రావాలని కోరారు. విద్యావంతులు, మేధావులు బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రమణయ్య, అజయ్‌కుమార్, మహేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, యాదగిరి ముదిరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీ కొట్టిన టిప్పర్

తీవ్ర గాయాలతో కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: స్కూటీపై డ్యూటీకి వెళ్తున్న ఓ కార్మికుడిని వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీ కొట్టిన ఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ నాగలక్ష్మి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన రఘుపతిగారి రామ్‌రెడ్డి(41) ఇస్నాపూర్ సమీపంలో ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. సోమవారం ఉదయం తన స్కూటీపై కంపెనీకి వెళ్తుండగా లక్దారం(తారా గ్రీవ్స్ ఫ్లోర్ కంపెనీ) సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది.ఈ ఘటనలో లారీ టైరు తలపై నుండి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన రామ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, వరసకు సోదరుడైన శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రబియా తహసీన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థినికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని జువాలజీ విభాగంలో రబియా 'బ్రాంకియల్ ఆస్తమా: ఏ సౌత్ ఇండియన్ స్టడీ'లో ఫోర్క్‌హెడ్ బాక్స్ పి3 జీన్ (3యూటీఆర్) యొక్క జన్యు వైవిధ్యాల పాత్ర' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. యూనివర్సిటీలోని జువాలజీ ప్రొఫెసర్ పర్వీన్ జహాన్, గవర్నమెంట్ జనరల్ ఛెస్ట్ హాస్పిటల్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

శేరిలింగంపల్లిలో 6.62 లక్షల ఓటర్లు


రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,62,496 ఓటర్లు ఉన్నారు. సోమవారం ప్రకటించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం ఓటర్ల వివరాలను శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్, ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. పురుష ఓటర్లు 3,52,243, మహిళా ఓటర్లు 3,10,115 ఉండగా, థర్డ్ జండర్ ఓటర్లు 138 మంది ఉన్నారు.కాగా ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ల్లో 17,914 మంది కొత్తగా నమోదయ్యారు. 622 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటరు జాబితాపై డిప్యూటీ కమిషనర్, ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఓటర్ల డ్రాఫ్ట్ కాపీలను రిజిస్టర్ పార్టీ కార్యాలయాలకు అందజేసినట్లు తెలిపారు. వచ్చే నెల 9వ తేదీ వరకు జాబితాలో అబ్జెక్షన్స్, క్లైమ్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అకోబర్ 4వ తేదీన తుది జాబితా వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు వంశీకృష్ణ, ప్రేమ్‌కుమార్, వాయిద్ అలీ, బీజేపీ నాయకులు శ్రీధర్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్‌యాదవ్, ఎంఐఎం నాయకులు నజీర్‌ఖాన్, టీడీపీ నాయకులు కిషోర్‌యాదవ్, సీపీఐ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకపూడి గాంధీని ఓడిస్తాం : ఉద్యమకారులు


మాట్లాడుతున్న ఉద్యమకారులు

- తమను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే టికెట్‌పై అసమ్మతి రాగం...

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పట్టించుకోవడం లేదని ఉద్యమకారులు ఆరోపించారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో శేరిలింగంపల్లి తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో తెలంగాణ ఉద్యమంలో తామంతా నడిచామన్నారు. కానీ ఇతర పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఉద్యమకారులను పట్టించుకోవడం లేదన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే టికెట్‌ను గాంధీకి కాకుండా కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు. ఓడిపోయే వ్యక్తికి ఇవ్వొద్దని వేడుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే గాంధీకి ఇస్తే ఉద్యమకారులమందరం కలిసి ఓడిస్తామన్నారు. సమావేశంలో ఉద్యమకారులు మల్లికార్జునశర్మ, సంగారెడ్డి, కృష్ణ గౌడ్, నర్సింగ్‌రావు, శేఖర్, సాయిలు, బాల్‌రాజ్, అంజద్, షరీఫ్, దేవేందర్, గౌస్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు


కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, డా.కొరదాల నరేష్, నాయికులు

కూకట్‌పల్లి: రాబోయే ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ గెలవాలంటే బూత్ కమిటీలను బలోపేతం చేయాలని కర్ణాటక రాష్ట్రం రాజరాజేశ్వరి నియోజకవర్గం ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు సూచించారు. సోమవారం నిర్వహించిన ఆల్విన్‌కాలనీ, పాపిరెడ్డినగర్ డివిజన్‌ల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వచ్చే మూడు నెలలు పార్టీ కార్యకర్తలు పూర్తి సమయం కేటాయించాలని, సీనియర్ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలన్నారు. అదే విధంగా ఎన్నికల్లో గెలవాలంటే ఓటర్ లిస్టుపై అవగాహన ఉండాలని ప్రతి బూత్‌లో ఆ బూత్‌కు సంబంధించిన కార్యకర్తలని బూత్‌ఏజంట్లుగా నియమించాలని సూచించారు. అనంతరం ఆల్విన్‌కాలనీ ఎస్సీ మోర్చా కార్యకర్త ఇంట్లో భోజనం చేసిన అనంతరం రాజేశ్వరి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొరదాల నరేష్, సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, రవీంద్రరావు, జానకి రామరాజు, రవికుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో కన్వీనర్ మణిభూషణ్ చారి, డివిజన్ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, స్రవంతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన పార్టీ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎమ్మెల్యే గాంధీని బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంతో కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేయడంతోపాటు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. కార్పొరేటర్లు సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటిశ్రీకాంత్, మంజులారెడ్డి, మాజీ కార్పొరేటర్ రంగారావు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గాంధీని నివాసానికి చేరుకొని ఆయనను అభినందించారు.

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి గాంధీ విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గాంధీని మళ్ళీ గెలిపించుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, గురుచరణ్ దుబే, అక్బర్ ఖాన్, ఓర్సు వెంకటేశ్వర్లు, పబ్బం మల్లేష్, నరేందర్ భల్ల, అంజద్ పాషా, హరీష్‌రెడ్డి, శ్రీకాంత్, యశ్వంత్, ధనలక్ష్మి, వరలక్ష్మి, రైసా, అనిత తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీని అభినందిస్తున్న పార్టీ మహిళా, ఇతర నాయకులు